క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన తిక్కవరప్పాడు-వెంకటాచలం గ్రామాల మధ్యన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..నిడిగుంటపాళేనికి చెందిన మణి మరో యువకుడితో కలిసి వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు వెళుతుండగా తిక్కవరప్పాడు సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ఇద్దరూ గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన బాలికల గురుకుల కళాశాలలో 2015లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఆ కళాశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎనిమిదేళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. స్నేహితులు, అధ్యాపకులతో గత స్మృతులను పంచుకొని ఆనందించారు. అనంతరం అధ్యాపకులను సన్మానించి వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చివరిగా సామూహిక విందు భోజనం చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలనాటి స్నేహితులతో కలిసి పాత జ్ఞాపకాలను పంచుకోవడం మధురానుభూతినిస్తోందని చెప్పారు. ఇలాంటి సమ్మేళన కార్యక్రమాల వల్ల స్నేహ బంధం మరింత బలపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ జలేంద్రుడు, కె.మహేశ్వరయ్య, రిటైర్డ్ ఓఎస్డీ దయాకర్, గురుకులాల ప్రిన్సిపాల్స్ టి.విష్ణుప్రియ, శోభాన్విత, సుజాత, యానాదుల సంక్షేమ సంఘ నేతలు వేణుబాబు, ప్రసాద్‌బాబు, సుధాకర్, కార్యక్రమ ఆర్గనైజర్‌లు పూజిత, శ్యామల, శారద, తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

కొడవలూరు: మండలంలో శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గాలివాన బీభత్సం సృష్టించింది. సుమారు అరగంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో మండలంలోని రెడ్డిపాళెంలో తాటిచెట్టు విద్యుత్ తీగలపై పడడంతో ఆరు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ స్తంభాలన్నీ వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించినవి కావడంతో రెడ్డిపాళెం, ఆలూరుపాడుల్లోని వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతుల ఫిర్యాదుతో స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ ఎం.రాములు ఆదివారం ఉదయం సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి మధ్యాహ్నానికి సరఫరాను పునరుద్ధరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సకాలంలో స్పందించి వ్యవసాయ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మోటార్ బైక్ బహిరంగ వేలం నేడు

కొడవలూరు : కోవూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని టీవీఎస్ రైడర్ మోటార్ సైకిల్‌కు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్.నరహరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బైక్ ధరను రూ.25 వేలుగా నిర్ణయించినట్లు తెలియజేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.2,500లు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 10.30 గంటలకు కోవూరు ఎస్ఈబీ స్టేషన్ వద్ద జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పల్లెపాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ వాదులు ఆయన ఆశయాల సాధనకు నడుంబిగించాలని బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుష్పాంజలి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ, అధ్యక్షుడు నందా ఓబులేసు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా నిలిచిందని, అట్టడుగు వర్గాలు రాజ్యాధికారం కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కృష్ణ, ధర్మయ్య, జ్యోతి శ్రీనివాసులు, రజినీకాంత్, నరేష్, వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సింహగర్జనకు తరలిన నేతలు

జలదంకి: విజయవాడలో ఆదివారం జరిగిన ప్రజా సింహగర్జన కార్యక్రమానికి జలదంకి మండలం గట్టుపల్లి రోడ్డు నుంచి ఉదయగిరి నియోజకవర్గం యాదవులు తరలి వెళ్లారు. యాదవ సంఘం నేతలు మధుకిషోర్ యాదవ్, యనమల శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం చేస్తున్న పోరాటమని తెలిపారు. బీసీల రాజ్యాధికారం కోసం బోడి రామచంద్రయాదవ్ చేస్తున్న కృషికి మద్దుతుగా ఉంటామన్నారు. దాదాపుగా ఉదయగిరి నియోజకవర్గం నుంచి 80 వాహనాల్లో సభకు బయలుదేరి వెళుతున్నట్లు తెలిపారు. రామచంద్రయాదవ్ పేద కుటుంబంలో పుట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరం అండగా నిలబడాలని కోరారు.



• ఈ ఫొటోలోని మహిళ అచ్చి దొరసానమ్మ నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలో నివాసం ఉంటున్నారు. ఈమె భర్త ఆటో నడిపి కుటుంబాన్ని పోషించేవారు. 45 ఏళ్లు పైబడిన ఈమెకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 మొత్తం జమైంది. ఈ నగదుతో గ్రామంలో టిఫిన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా వచ్చే సంపాదనతో బాగున్నారు. తనకు ఆర్థిక భరోసా కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలియజేశారు.



• ఈ చిత్రంలోని మహిళ కంచర్ల విజయమ్మ నెల్లూరు రూరల్ మండలం మన్నవరప్పాడులో నివసిస్తున్నారు. ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు బ్యాంక్ ఖాతాలో జమైంది. ఈ నగదుతో తాను నిర్వహిస్తున్న చిల్లర దుకాణాన్ని మరింత విస్తరించారు. అవసరమైన మేరకు నిత్యావసర సరుకులను నెల్లూరు నుంచి తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారం మరింత అభివృద్ధి చెందడంతో ఎంతో సంతోషిస్తున్నారు.



• ఈ ఫొటోలోని పద్మమ్మ నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడులో నివాసం ఉంటున్నారు. కాపు నేస్తం ద్వారా రూ.15 వేలు జమయ్యాయి. పథకాన్ని అమలు చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పథకాలు అందలేదని చెప్పారు.

మహిళలకు ఆర్థిక స్వావలంబన

• వైఎస్సార్ చేయూత, ఈబీసీ, కాపు నేస్తాలతో లబ్ధి
• గణనీయంగా పెరుగుతున్న లబ్ధిదారుల సంఖ్య





వైఎస్సార్ చేయూతకు ఆమంచర్లలో ఈ - కేవైసీ చేస్తున్న వలంటీర్

సచివాలయాలు	వైఎస్సార్ చేయూత	ఈబీసీ నేస్తం	కాపు నేస్తం
ఆమంచర్ల	304	72	03
దేవరపాళెం	107	01	09
దొంతాలి	56	09	07
గొల్లకందుకూరు	174	11	02
కాకుపల్లి బిట్ - 1	181	51	05
కందమూరు	143	31	06
మాదరాజుగూడూరు	231	15	03
ములుమూడి	265	23	04
పెనుబర్తి	93	08	02
సౌత్‌మోపూరు	351	17	01
వెల్లంటి	238	67	02

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ చేయూత, ఈబీసీ, కాపు నేస్తం ద్వారా 45 ఏళ్లు నిండిన మహిళలకు లబ్ధి కల్పిస్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో జమైన నగదుతో చిరు వ్యాపారాలు సాగించి వారు తమ కుటుంబాలకు పోషించుకుంటున్నారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల మహిళలకు సైతం పథకాల లబ్ధిని చేకూర్చడం ఎంతో బాగుంది.

– శైలేంద్రకుమార్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ

నెల్లూరు రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ చేయూత, ఈబీసీ, కాపు నేస్తం పథకాల లబ్ధిని నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నారు. తమకు అందిన నగదుతో చిన్నపాటి వ్యాపారాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. 45 ఏళ్లు దాటిన మహిళలకు ఆర్థిక భరోసా అందుతోంది. అర్హులకు పథకాల లబ్ధిని చేకూర్చేందుకు ఆయా ప్రాంతాల వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారు.

పథకాల లబ్ధి ఇలా..

• నెల్లూరు రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో 12 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 45 నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 2020 – 23కు సంబంధించి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధి పొందింది. 2249 మందికి రూ.4,21,68,750 మేర చెల్లించారు. ఒక్కొక్కరికీ రూ.18,750 చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు.
• ఈబీసీ నేస్తం ద్వారా 315 మందికి రూ.47.25 లక్షలను చెల్లించారు. లబ్ధిదారులకు రూ.15 వేల చొప్పున అందజేశారు.
• కాపు నేస్తం పథకం ద్వారా 44 మందికి రూ.6.6 లక్షలను జమ చేశారు. ఒక్కో మహిళకు రూ.15 వేల లబ్ధి చేకూరింది.

మానవాళిలో ప్రేమ, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలి



మాట్లాడుతున్న అబ్దుల్ వహాబ్ సాహెబ్

నెల్లూరు(బృందావనం): మత సంబంధం లేకుండా మానవాళి మధ్య ప్రేమ, సౌభ్రాతృత్వం కోసం అఖిల భారత మానవత సందేశ సమితి చేస్తున్న కృషిని ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ కొనియాడారు. వహాబ్‌పేటలోని పరివార్ ఫంక్షన్ హాల్లో అఖిల భారత మానవత సందేశ సమితి నెల్లూరు యూనిట్ సమావేశాన్ని మస్తాన్‌బాబా, మౌలానా అబ్దుల్ రషీద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నేతాజీ సుబ్బారెడ్డి, డాక్టర్లు సింధూజ, నారాయణరెడ్డి, దయాకర్‌రావు, లక్ష్మీనారాయణ, అన్వర్‌బాషా, అఖిల భారత మానవత సందేశ సమితి హైదరాబాద్ యూనిట్ మౌలానా సిద్ధిఖ్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డికి అభినందన



నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సోమవరపు భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా వెంకటచలపతి, ప్రధాన కార్యదర్శిగా గంగిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్నం చలపతిని ఎన్నుకున్నారు. వీరితో పాటు స్టేట్ కౌన్సిలర్లు, ఉపాధ్యక్షులు, సెక్రటరీలు, అసోసియేట్ సెక్రటరీలుగా పలువురు నియమితులయ్యారు.

బీఎస్ రావుకు నివాళి



నెల్లూరు (టౌన్): శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు బీఎస్ రావు సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కళాశాలల డీన్ శ్రీరామ్, ఏజీఎం శ్రీకాంత్, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సమావేశ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు (టౌన్): కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గానూ వచ్చే నెల ఆరున నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారు లీలామోహన్, జిల్లా అధ్యక్షుడు విశ్వమోహన్ పేర్కొన్నారు. వీఆర్సీ సెంటర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఉపాధ్యాయులు హాజరుకానున్నారని, డిమాండ్లు, హక్కుల సాధన కోసం సమావేశంలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నామని తెలిపారు.

బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్



నెల్లూరు(బృందావనం): ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన ముప్పా ప్రసాద్ నియమితులయ్యారు. నంద్యాలలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారని చెప్పారు. ఈ క్రమంలో తనను నియామక పత్రాన్ని సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, అధ్యక్షుడు మధుసూదన్‌శర్మ అందజేశారని తెలిపారు. మహేష్, నాగఫణి, శ్రీను, గోపాల్, రాము, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(బారకాసు): వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని భక్తవత్సలనగర్‌లోని ఎన్నెస్పీ ప్లస్ సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం అందజేశారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి డీఎల్‌హెచ్‌టీఓ అమరేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. దాదాపు 50 మందికి పౌష్టికాహారంతో పాటు దుస్తులను అందజేశామని సంస్థ అధ్యక్షురాలు ధనూజ తెలిపారు. డీఏపీసీయూఎస్ ప్రతినిధి శివకుమార్, డీపీఎం సురేంద్ర, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీఎమ్మెస్ చైర్మన్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఆదివారం కలిశారు. తన పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగించడంలో సహకరించిన మంత్రికి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సౌత్ వెస్టర్న్ రైల్వే ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎమ్మెస్ రాజు ఆదివారం కలిశారు. ఉద్యోగం పొందిన తాను మొదటగా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశానని చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు వినతి

నెల్లూరు రూరల్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించేందుకు గానూ ఏర్పాటు చేసిన బీఏఎస్ పథకంలో నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని రిపబ్లికన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మునెయ్య కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.

ఏపీవీఆర్వో సంఘాన్ని చీల్చే యత్నం తగదు

నెల్లూరు(బారకాసు): ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం(ఏపీవీఆర్వో)ను రెండుగా చీల్చేందుకు ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు యత్నిస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏపీవీఆర్వో నేతలు, సభ్యులు కొంతకాలంగా ఏపీజీఈఏతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో తమ సంఘ సభ్యుల మద్దతు లేకపోవడంతో ఏపీవీఆర్వోను చీల్చేందుకు బొప్పరాజు వెంకటేశ్వరరావు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆయన కమిటీకి మద్దతిచ్చేందుకు వెళ్లిన సభ్యులను తమ కమిటీ నుంచి తొలగించేలా తీర్మానించామని పేర్కొన్నారు. ఏపీవీఆర్వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలో ఒలింపిక్ డే రన్‌ను నెల్లూరు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఆదివారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద కార్యక్రమాన్ని అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. 500 మంది బాలబాలికలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు.. తిరిగి స్టేడియం వరకు 4కే రన్ సాగింది. హాజరైన వారికి టీ షర్టులు, టోపీలను అందజేశారు. రన్‌లో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులను పంపిణీ చేశారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న ఏడుగుర్ని సత్కరించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్, కోశాధికారి ఆనం రామకిషోర్‌రెడ్డి, ఆర్ఐపీఈ మహబూబ్‌బాషా, సెట్నెల్, డీఎస్ఏ సీఈఓ నాగరాజకుమారి, చీఫ్ కోచ్ యతిరాజ్, క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సనత్‌కుమార్, మధు, గాదం శ్రీనివాసులు, పావురాల వేణు, తదితరులు పాల్గొన్నారు.

‘అమీర్ అంతరంగం’ పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): రచయిత, షార్ వాణి సభ్యుడు అమీర్‌జాన్ రచనల సంపుటి అమీర్ అంతరంగం పుస్తకాన్ని నగరంలోని రామ్‌నగర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. విశాలాక్షి మాసపత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో షార్ వాణి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, తలారి శ్రీహరి, డాక్టర్ సుబ్బారావు, గంగిశెట్టి శివకుమార్, డాక్టర్ కేజే రావు, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డికాలనీలో వైద్య శిబిరం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని సాయినాథ్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నగరానికి చెందిన శ్రీవాత్సవ చెస్ట్, చిల్డ్రన్స్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పురిటి బిడ్డలకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. అనంతరం శ్రీవాత్సవ ఆస్పత్రి వైద్యులు చిరంజీవి, కల్యాణిని సత్కరించారు. డాక్టర్లు శ్రీనివాస్, ప్రసాద్, ఆయేషా, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఆదివారం సత్కరించారు. నిండు నూరేళ్లు వర్థిల్లు కార్యక్రమంలో భాగంగా ఈ నెల్లో జన్మించిన వాకర్స్‌ను సన్మానించారు. రాజగోపాల్, రఘురామిరెడ్డి, అంజనేయశెట్టి, రత్నం, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సుబ్బరాజు, రామచంద్రయ్య, అల్లూరి రాజు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా గోవింద రంగయ్య



మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా గోవింద రంగయ్య మాదిగను నియమించామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌కు స్థలాన్ని కేటాయించి నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. నేతలు వెంకట్రావ్, రఘు కేశవరావు, రియాజ్, కామేష్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి పీడీఎస్‌యూ రాజకీయ తరగతులు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బారకాసు): తిరుపతిలో ఆగస్టు 16 నుంచి 18 వరకు పీడీఎస్‌యూ నిర్వహించనున్న రాష్ట్ర వైద్య, వైజ్ఞానిక, రాజకీయ తరగతులను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూషణం, భాస్కర్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా నేతలు మహేష్, ఖాదర్‌బాషా, జానీ, సాయి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.